ఉచిత వైద్య సదుపాయం

జగద్గిరిగుట్ట: సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఆకార్ ఆశ హాస్పిటల్, కూకట్‌పల్లి సహకారంతో ఉచితంగా వైద్యం అందిస్తున్నారని జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టుకతో వచ్చిన అంగవైకల్యం, కాలిపోయిన గాయాలు, కణతులు, వంకర కాళ్లు వంటి వ్యాధులతో బాధపడుతున్నా వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీ అధ్యక్షులు, ఆశా కార్యకర్తలు, స్కూల్ మేనేజ్‌మెంట్, యువకులు ఈ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి 9490617157, 8712568311, 9849977622 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిన నాయకులు

జగద్గిరిగుట్ట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ విజయోత్సవ ర్యాలీకి మంగళవారం జగద్గిరిగుట్ట నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ర్యాలీకి అల్వాల్ భాస్కర్, వల్లూరి బాబు, ఎర్ర యాకన్న, ఎర్ర సోమన్న, చెవిటి వెంకన్న, దౌపాటి మల్లేశ్, చిప్పలపల్లి బాబు, కొమ్ము వెంకన్న, రామకృష్ణ, ద్వారపల్లి అంజయ్య, ఎర్ర విజయ్ తదితరులు తరలివెళ్లారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

రంగారెడ్డినగర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన సంక్షేమ సంఘాల నాయకులు షాపూర్‌నగర్‌లోని నివాసంలో మంగళవారం ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను వివరిస్తూ వినతి ప్రతాలు అందజేశారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా షిర్డీ హిల్స్‌కు చెందిన రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

'హర్ ఘర్ తిరంగా'లో భాగస్వాములు కావాలి



ఎమ్మెల్యేకు జాతీయ జెండాను అందజేస్తున్న సంపత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములై ఐక్యతను చాటాలని ఎమ్మెల్యే వివేకానంద్ పిలుపునిచ్చారు. చింతల్‌లోని క్యాంప్ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా తపాలా శాఖాధికారి సంపత్‌రెడ్డి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కేంద్ర పర్యాటక, సంస్కృతిక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సందేశ పత్రి, జాతీయ జెండాను ఎమ్మెల్యేకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా'లో ప్రజలు పాల్గొని జాతీయ స్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ లాల్‌సింగ్, పోస్ట్‌మెన్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించాలి



వాటర్ వర్క్స్ డీజీఎంకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

సుభాష్‌నగర్: సూరారం డివిజన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో తాగు నీటి ఎద్దడిని నివారించాలని కోరుతూ కాలనీవాసులు షాపూర్‌నగర్ వాటర్ వర్క్స్ డీజీఎంకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా సమయపాలన లేకుండా నీటి సరఫరా చేస్తున్నారని దీంతో నీళ్లు సరిపడా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఇచ్చినవారిలో కాలనీ ప్రెసిడెంట్ సురేశ్ బాబు, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఫీనిక్స్ వ్యవస్థాపక దినోత్సవం



పత్రాన్ని అందుకుంటున్న కార్పొరేటర్ రవికిరణ్

నిజాంపేట్: చుకపల్లి శంకర్‌రావు గౌరవార్థం నానక్‌రామ్‌గూడలోని ఫికిక్స్ అక్విలాలో మంగళవారం నిర్వహించిన ఫీనిక్స్ వ్యవస్థాపక దినోత్సవంలో నిజాంపేట్ కార్పొరేటర్ రవికిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఆయనకు సంస్థ ప్రతినిధులు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగన్‌యాదవ్, సాయిముదిరాజ్ పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



కౌసల్యకాలనీలో ర్యాలీ తీస్తున్న సిబ్బంది

నిజాంపేట్: బాచుపల్లి కౌసల్యకాలనీలో బాచుపల్లి తపాలా శాఖ, కౌసల్య కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సంయుక్తాధ్వర్యంలో మంగళవారం తపాలా శాఖ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సాగర్ దండప్ప అస్పాస్, పోస్ట్‌మాస్టర్ నాగమణి, పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, కౌసల్యకాలనీ అసోసియేషన్ సభ్యులు రంజిత్ కుమార్, నారాయణ మూర్తి, సలహా సభ్యులు నారాయణ మూర్తి, రమణ రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేరుకే స్వచ్ఛదనం-పచ్చదనం..!

- కూకట్‌పల్లి జోన్‌లో అంతంతమాత్రంగానే నిర్వహణ
- నర్సరీల్లో పెంచిన మొక్కల సంఖ్య 9.5 లక్షలు
- ఐదు రోజుల్లో నాటినవి కేవలం 60 వేల మొక్కలు మాత్రమే



హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్డులోని నర్సరీలో మొక్కలు

జగద్గిరిగుట్ట: గ్రేటర్‌లో పచ్చదనం పెంపే లక్ష్యంగా చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని తూతూమంత్రంగా ముగించారు. మొదట్లో అధికారులు, సిబ్బంది మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలపై పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించారు. అందుకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు కూడా పెంచారు. ఇటీవలే ఐదు రోజుల పాటు 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని చేపట్టారు. కూకట్‌పల్లి జోన్‌కు సంబంధించి సుమారు 9.5 లక్షల మొక్కలను సిద్ధం చేశారు. అయితే జోన్ పరిధిలోని కూకట్‌పల్లి, మూసాపేట్, గాజులరామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిల్‌లో 60 వేల మొక్కలు మాత్రమే నాటారు. అంటే మొత్తంగా 10 శాతం మొక్కలు కూడా నాటలేకపోయారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు, నాయకులు ఎవరూ కూడా అంతగా ఆసక్తి చూపకపోవడంతో ఇంకా నర్సరీల్లోనే మొక్కలు మూలుగుతున్నాయి. సిబ్బంది షెడ్యూల్ ప్రకారం మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేసినా టార్గెట్ మాత్రం అందుకోలేకపోయారు. ఆయా కాలనీల్లో మొక్కలను పంపిణీ చేశామని చెబుతున్నా.. కొన్ని కాలనీల్లో మాత్రం అసలు తమ కాలనీకి ఎవరూ రాలేదని స్థానికులు చెప్పడం గమనార్హం. ఇక ముందు పార్కులు, చెరువుల వద్ద మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రానున్న 20 రోజుల్లో మరో 10 వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేసినటుల యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభం 'సాక్షి'కి తెలిపారు. కాలనీలు, అపార్ట్‌మెంట్లలోకి మొక్కలు కావాలంటే అసోసియేషన్ లెటర్‌తో నర్సరీ (హెచ్ఎంటీ పైప్‌లైన్‌రోడ్డు) తమను సంప్రదిస్తే మొక్కలు అందజేస్తామని తెలిపారు.

అధ్వానంగా శ్మశాన వాటిక..!

చెత్త డంప్ కేంద్రంగా మారిన వైనం



శ్మశాన వాటిక ఆవరణలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు

రంగారెడ్డినగర్: డివిజన్‌లోని విజయ్‌నగర్‌కాలనీకి ఆనుకుని ఉన్న శ్మశాన వాటిక నిర్వహణ లేక అధ్వానంగా తయారైంది. ఆవరణంతా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. గతేడాది రూ.80 లక్షల నిధులతో గదులతో పాటు దహన సంస్కారాలు నిర్వహించేందుకు వీలుగా నీటి వసతి, స్నానపు గదులను నిర్మించారు. అయితే తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో స్థానికులు తమ ఇంట్లోని చెత్తను శ్మశాన వాటికలోనే పారబోస్తున్నారు. దీంతో ఆవరణ అంతా పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా మారింది. వైకుంఠధామం ప్రధాన గేట్ ముందే చెత్త పేరుకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తుచూపుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశాన వాటికను శుభ్రం చేయించి సాఫీగా దహన సంస్కారాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఈ విషయమై 'సాక్షి' సంబంధిత డీఇ రూపాదేవిని వివరణ కోరగా గురువారం అధికారులతో కలిసి స్పెషల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తామని తెలిపారు. పార్కులో చెత్తాచెదారం తొలగించి సమస్య పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ప్రధాన గేటు ఎదుట పేరుకుపోయిన చెత్త

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట్: నిజాంపేట్ ఏడో డివిజన్‌లోని సర్వే నంబర్ 190లోని రైజీనియా అపార్ట్‌మెంట్స్ నుంచి తిరుమల ఎన్‌క్లేవ్ వరకు రూ.15 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాఘవేంద్రరావు, ఆనంద్‌రెడ్డి, డీఈ వసంత, ఏఈ లక్ష్మీ నారాయణ, అంజనీర్ అరుణ్, కాంట్రాక్టర్ హర్యానాయక్ తదితరులు ఉన్నారు.

భాగ్యరథి డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

చింతల్: చింతల్ భాగ్యరథి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆహారోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల వంటకాలు, స్నాక్స్‌తో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించడం, పాక నైపుణ్యాలు ప్రదర్శించడం, పోషకాహారం, ఆరోగ్యం పై అవగాహన పెంచడం లక్ష్యంగా ఫుడ్‌ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నల్ల జైశంకర్‌గౌడ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



సకాలంలో స్పందించి.. యువకుడి ప్రాణాలు కాపాడి..

జగద్గిరిగుట్ట పోలీసుల సత్వర స్పందన



చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్‌గౌడ్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీసులు సకాలంలో స్పందించి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడారు. సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆల్విన్‌కాలనీ, సాయినగర్‌కు చెందిన సతీశ్‌గౌడ్ కుమారుడు విష్ణువర్ధన్‌గౌడ్ (25) మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన మిత్రులకు 'ఐ మిస్‌యూ' అని వాట్సాప్ మెస్సేజ్ పెట్టాడు. దీంతో అతని తల్లిదండ్రులు వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించారు. వారు వెంటనే స్పందించి జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా గంట వ్యవధిలోనే విష్ణువర్ధన్‌గౌడ్ కూకట్‌పల్లి కైతులాపూర్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి చూడగా కారులో మణికట్టు కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావమై అపస్మారకస్థితిలో ఉన్న విష్ణువర్ధన్‌గౌడ్ కనిపించాడు. అతను డోర్ లాక్ తీయకపోవడంతో పోలీస్ సిబ్బంది కారు అద్దాలు పగులగొట్టి యశోద ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ప్రాణాపాయం తప్పడంతో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. సకాలంలో యువకుడిని గుర్తించి ప్రాణాలు కాపాడిని జగద్గిరిగుట్ట పోలీస్ సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని అందుబాటులోకి తేవాలి



ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: షాపూర్‌నగర్ చౌరస్తాలోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని మేడ్చల్ జిల్లా బీజేపీ కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తై 6 నెలలు కావస్తున్నా ప్రారంభించకపోవడాన్ని నిరసిస్తూ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి విషయమై సర్కిల్ అధికారులను పలుమార్లు కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా పాదాచారులు రోడ్డు దాటేందుకు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, కొంపల్లి కౌన్సిలర్ రాజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంది శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు భవిగడ్డ రవి, గరిగె శేఖర్ ముదిరాజ్, కో కన్వీనర్ శివాజీరాజు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అరకల సుధా, జిల్లా సెక్రెటరీ కేశవ్ యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి భానుచందర్, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి అలివేలు, అసెంబ్లీ మహిళా మోర్చా కన్వీనర్ నాగమణి, ఓబీసీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్ వర్మ, డివిజన్ అధ్యక్షులు పులి బలరాం, పత్తి సతీశ్, సాయినాథ్ నేత, రాజేశ్వరరావు, కంది శ్రీరాములు, దుర్యోధనరావు, పరుష వేణు, పున్నారెడ్డి, మల్లేశ్ యాదవ్, సురేశ్ గౌడ్, సైదులు, సంతోష్ గుప్తా, ఝాన్సీ, బాబి నీల, వసుంధర, చక్రధర్, శేషారావు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కొంపల్లి రాయల్ పార్క్‌లో జాతీయ జెండాల పంపిణీ



కొంపల్లి రాయల్ పార్కులో జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని రాయల్‌పార్కులో బీజేపీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సతీశ్ సాగర్ మంగళవారం 500 జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సతీశ్‌సాగర్ మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ శివాజీ రాజు, కొంపల్లి అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, జిల్లా నాయకులు సరితారావు, శంకర్ నాయక్, నాయకులు గోపాల్ రెడ్డి, ఉదయ్, భాగయ్యగౌడ్, ఆంజనేయులు, మల్లేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో..

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గాజులరామారంలో కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ రామ్ లక్ష్మణ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రావుల శేషగిరి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇండ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్‌నేత, ప్రధాన కార్యదర్శి జ్ఞాని ఈశ్వర్, మహిళా మోర్చా అధ్యక్షురాలు రేవతి సింగ్, సోషల్ మీడియా కన్వీనర్ ప్రశాంత్, నాయకులు జగదీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎంజేఎఫ్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ర్యాలీ

నిజాంపేట్: ఎంజెఎఫ్ కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు గణేశ్ మాదిగ ఆధ్వర్యంలో మాదిగ జర్నలిస్టులు మంగళవారం సికింద్రాబాద్‌కు తరలివెళ్లారు. ముందుకు కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంజేఎఫ్ నాయకులు ముక్కెర్ల లాలయ్య, డప్పు రామస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము చిన్నా మాదిగ, తొండ వెంకట్, సురికొంటి శ్రావణ్, నరేశ్, దీపు, ముత్యపాగ శ్రీశైలం, అనిల్, రవి, ఎస్తేర్ రాణి, యాకుబ్, జలగం చంద్రయ్య, ఇంద్రాల లక్ష్మి, జిన్నపాక చంద్ర కళ పాల్గొన్నారు.

జ్వరపీడితులు 5,602 మంది



212 మందికి డెంగీ, ఇద్దరికి టైఫాయిడ్, మలేరియా

- సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు వైద్యారోగ్యశాఖ ఫీవర్ సర్వే
- దోమలు, అపరిశుభ్ర నీరు, ఆహారంపై ప్రజల్లో అవగాహన
- జ్వర పీడితులకు ఇంటి వద్దనే మందుల అందజేత



ఇంటింటా జ్వర సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇంటింటా జ్వర సర్వే చేపట్టి జ్వర పీడితులు, అనారోగ్యం బారినపడ్డ వారిని గుర్తించి వైద్యసేవలు అందజేస్తోంది. సీజనల్ వ్యాధులు విజృంభించకుండా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సూచనల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఈ సర్వే నిర్వహిస్తోంది. జిల్లాలో ఇదివరకు డెంగీ, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు ప్రబలిన ఏరియాలు, మురికివాడలు, బస్తీలతోపాటు హైరిస్కు ప్రాంతాలుగా గుర్తించిన పట్టణ, గ్రామాల్లో ఆశా, ఎఎన్ఎంలు, మండల వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వహిస్తున్నారు. ఆశా, ఏఎన్ఎంల బృందం ప్రతిరోజు దాదాపు 50 ఇళ్లు తిరిగి అనారోగంతో ఉన్నవారి వివరాలను సేకరిస్తోంది. వెంటనే సంబంధిత పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ, పల్లె దవాఖానాల వైద్యాధికారులకు సమాచారాన్ని అందజేస్తోంది. ఈ మేరకు సంబంధిత రోగి వద్దకు వైద్యాధికారులు వెళ్లి అవసరమైన మందులు అందజేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్నవారిని ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు.

ప్రజల్లో అవగాహన కల్పిస్తూ...

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఈ నెల 5 నుంచి మంగళవారం నాటికి 2,30,012 ఇళ్లను సర్వే చేశారు. ఇందులో 8,05,044 మంది నుంచి వివరాలు సేకరించగా, 5,602 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు అందజేశారు. ఇందులో 212 డెంగీ, రెండు టైఫాయిడ్, మలేరియా కేసులు నమోదయ్యాయి. వారికి వైద్యసేవలను సంబంధిత పీహెచ్‌సీల వైద్యులు అందిస్తున్నారు. సర్వే నిర్వహిస్తూనే వ్యాధుల కారకాలైన దోమలు, అపరిశుభ్రత, ఆహారం, పరిసరాల పరిశుభ్రత, నీటి శుభ్రతపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. అపరిశుభ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలు, బస్తీలు, పురపాలికల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయాలని సిబ్బందికి సూచనలు చేస్తున్నారు.

ఇంటింటికీ మందులు అందజేస్తున్నాం

సీజనల్ వ్యాధులు బారిన పడ్డవారిని గుర్తించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. జ్వరాలతో బాధపడేవారిని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ, పల్లె దవాఖానాల వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తున్నారు.

– డాక్టర్ రఘునాథ్‌స్వామి, డీఎంహెచ్ఓ, మేడ్చల్-మల్కాజిగిరి

ఎంఎల్ఆర్ఐటీ కాలేజీ ఎదుట ఆందోళన

దుండిగల్: ఎంఎల్ఆర్ఐటీ కళాశాల యజమాన్యం మేనేజ్‌మెంట్ కోటాలో విద్యార్థుల నుంచి ముందుగానే డబ్బులు వసూలు చేసింది. అయితే ఉన్నత విద్యా మండలి సీట్లు పెంచకపోవడంతో విద్యార్థుల ప్రవేశాలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ జిల్లా దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఎంఎల్ఆర్ఐటీఎం), ఐఏఆర్ఈ కళాశాలలు ఉన్నాయి. అయితే ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో యాజమాన్యం మేనేజ్‌మెంట్ కోటాలో విద్యార్థులకు సీట్లను కేటాయించింది. ఇందులో భాగంగా పలువురి నుంచి కొంత మేర డబ్బులు సైతం వసూలు చేసింది. అయితే ఉన్నత విద్యా మండలి రెండోసారి మేనేజ్‌మెంట్ సీట్లను పెంచకపోవడంతో డబ్బులు చెల్లించి సీటు పొందిన విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

కళాశాల ఎదుట ధర్నా..

విషయం తెలుసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, పలు విద్యార్థి సంఘాల నేతలు కళాశాలకు చేరుకుని ధర్నా చేపట్టారు. ముందుగానే లక్షల్లో డబ్బులు చెల్లించి మేనేజ్‌మెంట్ కోటాలో సీటు తీసుకున్నామని, ఇప్పుడు కళాశాల యాజమాన్యం తిరిగి డబ్బులు చెల్లిస్తామని నిర్లక్ష్యంగా చెప్తుందని, ఇతర కళాశాల్లో కూడా మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు అయిపోయాయని, ఇదే కళాశాలలో తమ పిల్లలకు సీట్లు కేటాయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు సీట్లు కేటాయించకపోతే వారి భవిష్యత్ నాశనమవుతుందని, వారికి న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నేతలు హెచ్చరించారు.